# కార్తీక పౌర్ణమి వేళలో..

రేపు..
కార్తిక పున్నమి



ఏ పున్నమి సౌందర్యం ఆ పున్నమిదే. కానీ, కార్తిక పౌర్ణమి మాత్రం.. వేయిపున్నముల సరిసాటి. ఆ కలికి వెన్నెల కెరటాలపై తేలియాడుతూ తన ప్రేమికుడు ముంగిట్లో వాలిపోతాడని ఓ పడుచు పరవశంగా పాడుకుంటుంది. ఆకాశం డాబా మీద అమ్మ శుభ్రంగా ఉతికి ఆరేసిన నాన్నగారి తెల్లచొక్కాతో పోలుస్తాడు ఆధునిక కవి. ఆ వెన్నెల కాంతులు ప్రసరించిన నీళ్లు.. అమృతంతో సమానమని చెబుతారు ఆయుర్వేద వైద్యులు. భారతీయులు చంద్రుడిని అమ్మ పుట్టింటి చుట్టంగా చూస్తారు. మేనమామగా భావిస్తారు. ఇదొక ఆత్మీయతా చిహ్నం. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అంతరిక్షంలోకి పంపించిన చంద్రయాన్- 3 ఇప్పటికే చందమామ దక్షిణ ధ్రువాన్ని చేరుకుని తన పని తాను మొదలుపెట్టింది. ఈ ఘనత సాధించిన తొలిదేశంగా భారత్ చరిత్రపుటల్లో నిలిచిపోయింది. చల్లటి వెన్నెల కురిపించే చందమామ గురించి మన పురాణాల్లో, ప్రజల నోళ్లలో ఎన్నో కథలు ఉన్నాయి. వాటిలో కొన్ని...



## వీర శివాజీ చంద్ర తిలకం

మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ తన నుదుటిపై అర్ధచంద్రుడి తిలకం ధరించినట్లు ఉంటుంది. చంద్ర– కోర్‌గా పిలిచే ఈ బొట్టు వెనక ఒక కథ ప్రచారంలో ఉంది. స్వరాజ్య స్థాపనదిశగా మహారాష్ట్రులకు స్ఫూర్తిదాయకంగా ఉండటానికి ఆయన ఇలా చేశాడట. చంద్రోదయం అయ్యిందంటే అమావాస్య కటిక చీకటి ముగిసినట్టే. అంతేకాదు, దినదిన ప్రవర్ధమానమయ్యే నిండు చంద్రుడిలా తన సామ్రాజ్యం కూడా పెరిగి పెద్దది అవ్వాలనే శివాజీ కాంక్షకు ఆయన నుదుట కొలువుదీరిన అర్ధ చంద్రుడు సంకేతం అంటారు. అప్పటినుంచి మహారాష్ట్ర శౌర్యానికి నిదర్శనంగా స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా నుదుటి మీద అర్ధచంద్ర తిలకం ధరిస్తున్నారట. శివరాజు స్ఫూర్తిని కొనసాగిస్తున్నారట.